షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి దయారుగూడలో అంబేడ్కర్ విగ్రహానికి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహం పక్కన మంగళవారం సింగూరు పాండు ఆధ్వర్యంలో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీసీకి వినతి


వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

కూకట్‌పల్లి : జేఎన్‌టీయూలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంగళవారం వీసీ కిషన్‌కుమార్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల హాస్టల్‌లో మంచి నీటి సమస్య, మెస్ సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే విధంగా స్పోర్ట్స్ మెటీరియల్ ఇవ్వాలని కోరారు. యూనివర్సిటీలలో ధర్నాలు చేయొద్దని ఆదేశించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్, నాయకులు ఎత్తరి రమేష్, రంజిత్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయమని, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట్ షేర్ గల్లీలో అల్తాఫ్ రాజా ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ కార్యదర్శి యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, ముక్కల నర్సింగ్‌రావు, సయ్యద్ ఇజాజ్, ఇర్ఫాన్, మీరాజ్, ఓమర్, సలీం, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ యాదవ్, అక్తర్, అంజద్, ముస్తఫా, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



మోతీనగర్: పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్‌లో నివాసం ఉండే పార్టీ కార్యకర్త రవియాదవ్ తల్లి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుంది. ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట మేడ్చల్ జిల్లా ఓబీసీ కార్యదర్శి గోనెల సుదర్శన్, సీనియర్ నాయకులు నార్లపురం శ్రీనివాస్, వెంకటరామిరెడ్డి, పూజారాం, గోపి, శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

సుభాష్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమీపంలో చింతల్ హెచ్‌ఎంటీ కాలనీకి చెందిన డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న సూరారం పోలీసులు ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు అక్కడకు చేరుకోగా.. నిందితుడు పారిపోవడానికి యత్నించాడు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు అతడిని పట్టుకుని 260 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- జిల్లా కలెక్టర్ గౌతమ్
- బాలుర, బాలికల మైనార్టీస్ పాఠశాలల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కూకట్‌పల్లి: కృషి, పట్టుదల, క్రమశిక్షణతోనే లక్ష్యాలను అవలీలగా చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి మండల పరిధిలోని బృందావన్ కాలనీలో కుత్బుల్లాపూర్ మైనార్టీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, కాలేజీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. భవిష్యత్‌లో ఏ కోర్సులు చేయాలనుకుంటున్నారో పదవ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. స్కూల్ భవనానికి చెల్లించే అద్దెలో 5 శాతం మినహాయించి చిన్న, చిన్న మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సమీపంలో ఉన్న బాలానగర్ తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, కాలేజీని కూడా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీసీఈఓ కాంతమ్మ, కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి, ప్రిన్సిపాల్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

కూకట్‌పల్లి: పల్లె దవాఖానాల్లో అందించే వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మండలంలోని హౌసింగ్ బోర్డు నాల్గవ ఫేజ్‌లోని పల్లె దవాఖానను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె దవాఖానాల్లో ఓపీ సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలందించేందుకు మెడికల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని చోట్ల వెంటనే నియమించాలన్నారు. పల్లె దవాఖానాకు రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారని, ఏయే వైద్య సేవలు అందిస్తున్నారో వివరాలతో పాటు మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గత నాలుగు మాసాలుగా


దవాఖానాను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మందుల జారీకి సంబంధించిన రికార్డుల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా బాలాజీనగర్ పల్లె దవాఖానను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి ఉమా గౌరి, కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువవికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, యువకులు

- ఏప్రిల్ 5 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: రాజీవ్ యువవికాసం పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకానికి ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకంలో అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. 60 నుంచి 80 శాతం సబ్సిడీ అందిస్తోందన్నారు. దరఖాస్తునకు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. పాన్‌కార్డు, పాస్‌పోర్టు ఫోటో, ఫోన్ నెంబర్, బ్యాంకు పాస్‌బుక్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక రేషన్ కార్డులోని సభ్యులలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నల్లగండ్లలో పథకంపై అవగాహన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజీవ్ యువ వికాసం పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఈ స్కీంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన యువతకు రూ.4 లక్షల వరకు రుణాలను అందిస్తారన్నారు. ఏప్రిల్ 5 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలింగ్ యాదగిరిగౌడ్, కృష్ణ ముదిరాజ్, శ్రీనివాస్, రేణుక, సునీతారెడ్డి, నాగమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించాలి

దుండిగల్: ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిదారులపై చర్యలు తీసుకుంటామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆస్తి పన్ను వసూళ్ల పని తీరును మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి జి ప్రభాకర్, మేనేజర్ బి లక్ష్మయ్య, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఆభరణాలు చోరీ



సుభాష్‌నగర్: తాళం వేసిన ఇంట్లో బంగారం, వెండితో పాటు నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూరారంలోని దీక్ష స్కూల్ సమీపంలోని కార్తీక్ నేచర్ స్పేస్‌లో నివాసముండే విఠల్ కుటుంబం ఈ నెల 22న బీదర్‌లోని తమ బంధువుల వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా ఓ దొంగ ఈ నెల 24న తెల్లవారుజామున 2 గంటల సమయంలో ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించి తాళం పగలగొట్టి చోరీ చేశాడు. ఇంట్లో ఉన్న బీరువా పగులగొట్టి 2 తులాల బంగారం, 30 తులాలు వెండి, రూ.50 వేల నగదు అపహరించారు. మంగళవారం మధ్యాహ్నం విఠల్ కుటుంబం ఇంటికి రాగా.. తాళం పగలగొట్టి ఉండటంతో బీరువా చూసి చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం

కుత్బుల్లాపూర్: నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇటీవల అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఒరిగంటి వెంకటరమరాజుకు రూ.60 వేలు, జి. లక్ష్మమ్మకు రూ. 35 వేల చెక్కులను షాపూర్ నగర్‌లోని తన నివాసంలో మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజా పాలనలో


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఈఐఆర్ ద్వారా 126 సెల్‌ఫోన్‌ల రికవరీ


సెల్‌ఫోన్‌లు అందుకున్న వారితో పోలీసులు

జీడిమెట్ల: ఎనిమిది పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న 126 మంది బాధితులకు బాలానగర్ డీసీపీ ఏ సురేష్‌కుమార్ రికవరీ చేసి వారికి అందజేశారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బాధితులకు రూ.28 లక్షల విలువచేసే ఫోన్‌లను అందించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు. కేపీహెచ్‌బీ- 35, జీడిమెట్ల- 23, బాచుపల్లి- 18, సనత్‌నగర్-17, కూకట్‌పల్లి- 14, అల్లాపూర్- 9, జగద్గిరిగుట్ట- 7, బాలానగర్ పరిధిలోని ముగ్గురికి అందజేశారు. సమావేశంలో బాలానగర్ ఏసీపీ హన్మంత్ రావు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐలు నర్సింహరాజు, కనకయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో వేగంగా నిర్మాణం

దుండిగల్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. మంగళవారం బౌరంపేట్‌లోని లక్ష్మీనరసింహ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని అన్నారు. డీలర్ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాల ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మార్కెటింగ్ రాజేంద్ర ప్రసాద్, 20 మంది మేస్త్రీలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్ కాలనీలో సుమారు రూ.48 లక్షల వ్యయంలో భాగంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాల దృష్ట్యా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో వుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

కూకట్‌పల్లి: హనుమాన్ నగర్ చుట్టుపక్కల బస్తీలలో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఈ పీరయ్య నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజుల నుంచి లో ఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హనుమాన్ నగర్, దీనబంధు కాలనీ, ప్రగతినగర్, రామకృష్ణనగర్, పాపిరెడ్డి కాలనీ తదితర బస్తీలలో లో ఓల్టేజీ వల్ల ఫ్రిడ్జి, ఫ్యాన్‌లు, టీవీలు దెబ్బతింటున్నాయని వివరించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పోలయ్య, కృష్ణారావు, డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత


రంజాన్ తోఫాను అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

మోతీనగర్: రంజాన్ మాసంలో నిరుపేద ముస్లింలకు నిత్యావసర వస్తువులను అందజేయడంతో జీవితానికి సంతృప్తి లభిస్తుందని నీలిమా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం అల్లాపూర్ ప్రధాన రోడ్డులో ముస్లింలకు పది రకాల నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 సంవత్సరాల నుంచి రంజాన్ మాసంలో నిరుపేద ముస్లింలకు నిత్యావసర వస్తువులతో పాటు నూతన వస్త్రాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సురభి మెడికల్ కళాశాల చైర్మన్ హరేందర్ రావు, డాక్టర్ సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.9,885 ఫైన్ చెల్లించిన ద్విచక్రవాహనదారుడు

సుభాష్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తూ చలాన్‌లు చెల్లించకుండా తిరుగుతున్న వ్యక్తి నుంచి జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు రూ.9,885 నగదును చలాన్ రూపేణా వసూలు చేశారు. మంగళవారం సూరారం చౌరస్తాలో జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న సూరారం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన వెంకట రఘు పట్టుబడ్డాడు. సదరు బైక్ నెంబర్ (టీఎస్ 08ఎఫ్‌క్యూ 0030)పై ఆన్‌లైన్‌లో తనిఖీ చేయగా.. అతను 61 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలింది. ఇందులో 51 సార్లు హెల్మెట్ ధరించకుండా డ్రైవ్ చేయగా, మరో 10 సార్లు ట్రిబుల్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లలో వాహనం నడిపినట్లు గుర్తించారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సదరు యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి సదరు మొత్తాన్ని ఫైన్ రూపంలో వసూలు చేశారు.



'సఖి' ద్వారా మహిళలకు ఉచిత సేవలు

సుభాష్‌నగర్: సూరారం వెంకటరమణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 'సఖి' టీమ్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు, వరకట్నం వేధింపులు, ఇతర సమస్యలపై అవగాహన కల్పిస్తూ బాధితులు ఎవరైన ఉంటే 181 హెల్ప్‌లైన్ నెంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. బాధిత మహిళలకు న్యాయ సహాయం, మెడికల్ అండ్ షెల్టర్, కౌన్సిలింగ్ వంటి సేవలు ఉచితంగా లభిస్తాయన్నారు. అదే విధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముంజుల, ఏడబ్ల్యూబ్ల్యూ కార్యకర్త శోభ, లావణ్య, పారామెడికల్ అక్షయ, ఉపాధ్యాయులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వార్డు అధికారుల చేతుల్లో 'పుర సేవలు'

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల పరిశీలన బాధ్యత అప్పగింత

- పని ఏదైనా వారిదే కీలకం
- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర పురపాలక శాఖ
- నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు



సాక్షి, సిటీబ్యూరో: పురపాలిక సంఘాల్లోని వార్డు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. జనన, మరణ ధ్రువపత్రాల పరిశీలన బాధ్యతలను వారికి అప్పగిస్తూ ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలికల్లో ఏ పనుల్లోనూ వార్డు అధికారుల ప్రమేయం అంతగా ఉండటం లేదు. ఇక నుంచి ఏ పని చేసినా వారి పాత్ర కీలకం కానుంది.

ధ్రువపత్రాల జారీలో..

పురపాలక సంఘాల నుంచి ధ్రువ పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన దుస్థితి నెలకొంటోంది. సాధారణంగానే పట్టణాల్లో ఇటీవల జనన, మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. దీనికి తోడు పురపాలికల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన నేపథ్యంలో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉండగా, ఇటీవల అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న 40 గ్రామ పంచాయతీలు సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనమయ్యాయి. ఒక్క మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల పరిధిలో 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. బర్త్, డెత్, మ్యారేజ్ సర్టిఫికెట్లు(ధ్రువీకరణ పత్రాలు)తో సహా ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లు, మ్యూటేషన్లు నల్లా అనుమతులు పొందడానికి కూడా స్థానిక ప్రజలు పాట్లు పడాల్సి వస్తోంది.

మిగతా వాటిల్లోనూ అంతే..

పురపాలక సంఘాల్లో చెత్తా చెదారం, డ్రైనేజీ, పారిశుద్ధ్యం సమస్యలు కూడా ప్రజలను వెక్కిరిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పెరిగిన చెట్ల పొదలు, పేరుకుపోతున్న చెత్తా చెదారంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పన్నుల వసూళ్లతో సహా వాణిజ్య వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థలకు సంబంధించి పన్ను మదింపు(ఖరారు)లోనూ ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మాణాల అనుమతుల విషయంలోనూ తీవ్ర జాప్యమే కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతో ఈ వ్యవహారంపై రాష్ట్ర పురపాలక శాఖకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే పత్రాలు జారీ చేయడం ఏమిటని రాష్ట్ర పురపాలకశాఖ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత బాధ్యతలను వార్డు అధికారులకు అప్పగిస్తూ పరిశీలన చేపట్టి తప్పులు లేకుండా పత్రాలు జారీ చేయాలని సూచిస్తోంది. పట్టణాల్లో నేరుగా మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని ధ్రువపత్రాన్ని తీసుకుంటున్నారు. పురపాలికల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన పెరగాలన్న ఉద్దేశంతో వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇక నుంచి వెంటనే జనన, మరణ ధ్రువపత్రాలు అందనున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగిస్తామని పురపాలక సంఘాల కమిషనర్లు పేర్కొంటున్నారు.